జ్వరాల పంజా

- కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, వాపులతో ఇబ్బందులు
- 100 మందికి పైగా జ్వరపీడితులు
- పద్మనాభనగర్‌లో విజృంభిస్తున్న జ్వరాలు
- పట్టించుకోని అధికారులు
- కనీసం ఫీవర్ సర్వే నిర్వహించలేదంటున్న ప్రజలు



జ్వరంతో బాధపడుతున్న మహిళ



నిర్మానుష్యంగా పద్మనాభనగర్‌లో ఓ వీధి

గోపాలపట్నం: ఆ గ్రామాన్ని విషజ్వరాలు వణికిస్తున్నాయి. నెల రోజుల నుంచి ప్రతి ఇంటినీ పలకరిస్తున్నాయి. గ్రామంలో 600 మంది ఉంటే వంద మందికి పైగా జ్వరాల బారిన పడ్డారు. దీంతో ఏ వీధి చూసినా నిర్మానుష్యంగా కనిపిస్తోంది. అయినా అధికారులు, నాయకులు తమ వైపు చూడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెల రోజులుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన వారికి కూడా వస్తోందని చెబుతున్నారు. అయితే జ్వరాల విషయం అధికారులకు తెలియక పోవడం విడ్డూరంగా ఉందని మండిపడుతున్నారు. తమ ఇబ్బందులు, బాధలు ఎవరికీ పట్టడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని పద్మనాభనగర్ జనతా కాలనీ, పరిసర ప్రాంతాల వాసులు విష జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్యశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చాలా మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు.



ఆస్పత్రికి వెళ్లి వస్తున్న కుటుంబ సభ్యులు



మురుగుతో ఉన్న కాల్వ

జరం తగ్గినా నొప్పులు తగ్గడం లేదు...

జ్వరం మూడు రోజుల్లో తగ్గినా కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు తగ్గడం లేదని వాపోతున్నారు. దీని కోసం మందులు వేసుకున్నా ఫలితం లేకపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాశాఖ అధికారులు శిబిరం ఏర్పాటు చేసి సరైన వైద్యం అందివ్వాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఏదైనా పని చేసుకోకపోతే రోజు గడవని పరిస్థితి. జ్వరాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంట్లో పనులు కూడా చేసుకోలేక పోతున్నాం. నొప్పులు భరించలేక పోతున్నాం. అధికారులు, పాలకులు స్పందించి మంచి వైద్యం అందించాలి.

–మారమ్మ, పద్మనాభనగర్

భరించలేని బాధ



జ్వరం మూడు రోజులే ఉంది. కాని నొప్పులు తగ్గలేదు. భరించలేని విధంగా ఉన్నాయి. చాలా దారుణమైన బాధ అనుభవిస్తున్నాం. ఈ జ్వరాలు ఏ దోమకాటు వల్ల వచ్చాయో తెలియడం లేదు. మా ప్రాంతంలో చాలా మందికి ఇదే విధంగా జ్వరాలు వచ్చాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఎస్, ధనలక్ష్మి, పద్మనాభనగర్

పనికి వెళ్లలేని పరిస్థితి



ఈ ప్రాంతంలో కూలి పనులు చేసేవారు.. ఆటోలు నడిపే వారు ఎక్కువగా ఉన్నారు. జ్వరాలతో పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. మా ప్రాంతంలో కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. వాటి వల్లే దోమలు ఎక్కువవుతున్నాయి. మలేరియా విభాగం అధికారులు నెలకోసారైనా కనిపించడం లేదు. దోమలను నివారించేందుకు అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

– సొలాపు మారయ్య, పద్మనాభనగర్

రోడ్డు ఇలా.. నడిచేదెలా !



వెంకన్నపాలెంలో మట్టి రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

మల్కాపురం: ఆ గ్రామం గ్రేటర్ సిటీ పరిధిలో ఉంది. అయినా మట్టి రోడ్డే వారికి శరణ్యం. అదే జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కృష్ణా రెస్టారెంట్ నుంచి వెంకన్నపాలెం వెళ్లే మార్గం. ఈ మట్టి రోడ్డు పలు చోట్ల గుంతులు పడింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో పాటు గుంతల్లో నీరు చేరింది. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు,పాలకులు స్పందించి ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు వేయించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఆంధ్రనాట్యంపై 12 నుంచి సెమినార్

మద్దిలపాలెం : ఆంధ్ర నాట్యంపై మూడు రోజుల సెమినార్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 సంవత్సరాల వయసు పైబడిన వారంతా పాల్గొనవచ్చన్నారు.

క్లుప్తంగా

స్నేహితులకు అండగా...



కొత్తపాలెంలో అప్పలరాజుకు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

గోపాలపట్నం: తమతో చదువుకున్న సహచరులకు స్నేహితులు అండగా నిలిచారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 ఏడాది పదో తరగతి చదివిన వెంకటరమణ సింహాచలంలో నివాసముంటున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. అలాగే కొత్తపాలేనికి చెందిన బత్తుల అప్పలరాజు ఆర్థికంగా చితికి పోవడంతో తోటి స్నేహితులు సాయపడ్డారు. స్నేహితులంతా కలిసి పోగు చేసిన రూ.30 వేలను ఇద్దరికి అందజేశారు. మేమంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నూనెల శ్రీనివాసరావు, శేష గిరి, దీప్తి, ఒమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. డిస్ట్రిక్ట్ మిషన్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) ఆధ్వర్యంలో బుధవారం సూర్యాబాగ్‌లోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో నిర్వహించిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ కోటి రెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వివరించారు. ప్రజలకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అక్షరాలు, భాష, మాట, పరస్పర సమన్వయంతో కవిత పుట్టుకొస్తుందన్నారు. మాట కవిత్వంగా ధ్వనించాలంటే రుషితత్వం కావాలన్నారు. అసలైన కవిత్వం ప్రజల సమస్యలను, కన్నీళ్లను సముదాయించి సమాజ సంక్షేమానికి బాట కావాలని పేర్కొన్నారు. కవులు వినయ భూషణ్, కె.రామ్‌ప్రసాద్, సీహెచ్ చినసూర్యనారాయణ, బి.ఎస్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, కె.జగదీశ్వరరావు, వి.హెచ్.రామ్మోహన్, జి.రామమూర్తి, ఆర్.శివాజీ తమ స్వీయ కవితలు చదివి వినిపించారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు.

విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం ప్రారంభం



విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ గౌరీనగర్‌లో విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం పరిధి విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. విశాఖ పశ్చిమానికి టూరిజం అధికారిగా మాధవిని, ఐదుగురు సచివాలయ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా జీవీఎంసీ జోనల్ వ్యవస్థను తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్–8 కమిషనర్ హేమావతి, జోన్–5 కమిషనర్ రాము, కార్పొరేటర్లు రమణ, రాజశేఖర్, గల్లా చిన్న, వై. తిరుమలరావు, సత్తిరాజు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించారు



ఎన్ఏడీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చెత్త తొలగించిన తర్వాత ఇలా

సాక్షి ఎఫెక్ట్..



గ్రీన్ బెల్టులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ జంక్షన్, ఫ్లైఓవర్ వద్ద పేరుకు పోయిన చెత్త కుప్పలను జీవీఎంసీ శానిటరీ అధికారులు తొలగించారు. ఇక్కడ సమస్యపై సాక్షి దినపత్రికలో బుధవారం గలీజు అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి శానిటరీ అధికారులు స్పందించారు. ఫ్లైఓవర్ కింద ప్రాంతంతో పాటు అంబేడ్కర్ విగ్రహం, గ్రీన్ బెల్ట్ రోడ్డులోని చెత్తకుప్పలు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే మద్యపానం, ధూమపానం చేస్తున్న వారిని కూడా కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిబద్ధతతో పని చేయండి



శిక్షణ కేంద్రంలో ట్రైనీలతో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: డీఆర్ఎం లలిత్ బోహ్రా బుధవారం మర్రిపాలెంలోని మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న లోకోపైలెట్స్, అసిస్టెంట్ లోకో పైలెట్స్, ట్రైన్ మేనేజర్లతో ఆయన ముఖాముఖి మాట్లాడి శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న వారంతా ఏకాగ్రత, ఉన్నత ప్రమాణాలు, నిబద్ధతతో విధులు నిర్వర్తించేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శిక్షణ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు.

పరిశోధనలతో మత్స్యకారుల అభ్యున్నతి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో స్టోరీస్ ఆఫ్ రిసిలియెన్స్ సోషల్ ఇంక్లూజన్ ఆఫ్ ఫిల్డింగ్ కమ్యూనిటీస్ ఫర్ వికసిత్ భారత్ – 2047 అనే అంశంపై బుధవారం అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివక్షకు గురవుతున్న మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. క్షేత్ర స్థాయి పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కెనడాలోని కాంప్సన్ రివర్స్ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ వర్క్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలా నిక్కు మాట్లాడుతూ భారతదేశంలోని మత్స్యకారులు ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేకపోతున్నారన్నారు. స్థిరమైన ఆదాయం లేకపోవడంతోపాటు ఏడాదికి రెండు నెలలపాటు చేపల వేటకు విరామం ఇవ్వడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న కష్టాలు వివరించారు. ఐసీఎస్ఎస్ఐఐ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ చేపల వేట వృత్తి సవాలుతో కూడుకున్నదని, చాలా ప్రమాదకరమైనదన్నారు. మత్స్యకార యువతకు విద్య అవసరమని, ప్రస్తుతం చాలా మంది ఈ వృత్తిని ఎంచుకోవడం లేదన్నారు. పీఏకాన్ ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.దాసు మాట్లాడుతూ తీరం నుంచి సముద్రంలోకి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు వందలాది మంది మత్స్యకారులు మరణిస్తున్నారన్నారు. డాక్టర్ ఎస్.బాబావలి, డాక్టర్ బి.శివరామకృష్ణ, ఆచార్య ప్రేమానందం పాల్గొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.హరినాథ్, అసోసియేట్ డీన్ డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ కీలకం

మద్దిలపాలెం : దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సహజ నైపుణ్యాలతో రాణించాలన్నారు. సామర్థ్యాలను గుర్తించి, వాటిని మరింత మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ శిబిరం అత్యుత్తమమైనదన్నారు. పారదర్శకంగా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథక కార్యక్రమాల్లో ఏయూ అగ్ర భాగాన ఉందని ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.సింహాచలం, జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏయూ ఉపకులపతిగా అందించిన సేవలను వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తదాతలుగా నిలవాలని సూచించారు. కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా అన్నదానమే మిన్న



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు



శ్రీహరిపురంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్న సీఐ అప్పారావు యాదవ్

సింథియా: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో అంబేద్కర్ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో బుధవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసినా రాని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. పేదల కడుపు నింపే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు రావాడ అప్పారావు, రామకృష్ణ, కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

జీవీఎంసీ 40వ వార్డు కాకరలోవ గ్రామంలో వాడ బలిజ వీధి యంగ్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వాడబలిజ సంఘం అధ్యక్షుడు వారాది శ్రీనివాసరావు, యలగాడ రాజు, గణేష్ మిశ్రా, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీనివాస్‌నగర్ వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్, కోరాడ శ్రీను, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పోత్తబత్తుల శ్రీను తదితరులు పూజలు చేసి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద యాదవ్ యూత్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మండపం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నూనెల మహేష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని

ప్రారంభించారు.



62వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

అంకితభావంతో విధుల నిర్వహణ



జోన్–3 కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సీతంపేట: ప్రతి అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో బుధవారం జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి, అవి ఏ స్థాయిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయించాలని, సహాయక ఇంజినీర్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయరాదని, అది జారీ చేసిన అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోన్ పరిధిలో ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ప్లాన్ మంజూరు దరఖాస్తును రెండు కంటే ఎక్కువ రోజులు తమ లాగిన్‌లో ఉంచుకున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, ప్లానింగ్ కార్యదర్శి విష్ణుకుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జెడ్సీని ఆదేశించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా



అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న గిగ్ వర్కర్లు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద స్విగ్గీ, జొమాటో రైడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార మంగళం, అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. బేస్ పే రూ.30కు పెంచాలని, గతంలో ఇచ్చిన విధంగా పీక్ రూ.12, నాన్ పీక్ రూ.10 ఇవ్వాలని కోరారు. లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ప్రతి శని, ఆదివారాల్లో సేవలకు బంద్ పాటిస్తామని హెచ్చరించారు.